క్లుప్తంగా

ఎన్నికల నియమావళి పాటించాలి



ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బందోబస్తు

సిర్పూర్(టి): అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ బందోబస్తులో భాగంగా మంగళవారం సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు మండలం మీదుగా వెళ్లే అంతర్రాష్ట్ర రహదారుల్లో ఎన్నికల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సిర్పూర్(టి) –మాకిడి, వెంకట్రావ్‌పేట్ –పోడ్సా అంతర్రాష్ట్ర రహదారుల్లో ఎన్నికల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల కోడ్ నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

'కాంగ్రెస్‌తోనే సమస్యల పరిష్కారం'



మాట్లాడుతున్న మర్సుకోల సరస్వతి

కెరమెరి: కాంగ్రెస్ పార్టీతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి అన్నారు. మంగళవారం మండలంలోని జోడేఘాట్ చిన్న, పెద్ద పాట్నాపూర్, శివగూడ తదితర గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కుసుంబ్‌రావు, యూత్ అధ్యక్షుడు దండుగల శ్రీనివాస్, నాయకులు శంకర్, జగన్నాథ్, జంగు, రాజు, భీంరావు తదితరులు ఉన్నారు.

12 నుంచి క్రికెట్ టోర్నీ

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. వీర్దండి యూత్ ఆధ్వర్యంలో గ్రామంలోని కుమురం భీం మినీ స్టేడియంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 12 నుంచి నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9553043502, 9640277223 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు ప్రశాంత్, మారుతి, కార్తీక్ కోరారు.

ఇంటర్మీడియెట్ విద్యాధికారికి సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన శంకర్‌ను ఆయన కార్యాలయంలో స్థానిక చైతన్య కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్ ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను ఆయనకు వివరించారు. డీఐఈవో పలు సూచనలు సలహాలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు సన్మానం

జైనూర్: గత కొంత కాలంగా మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సమీర్ హైమద్‌ఖాన్ రెబ్బెనకు బదిలీపై వెళ్తుండడంతో మండల నాయకులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన స్థానంలో తిరుపతి బుధవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జమీల్, సర్పంచులు పార్వతీ లక్ష్మణ్, గేడం లక్ష్మణ్, నాయకులు శేఖర్, అబ్బు, మండల కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

కేసీ వేణుగోపాల్‌ను కలిసిన అనిల్‌కుమార్



వినతిపత్రం అందజేస్తున్న అనిల్‌కుమార్

ఆసిఫాబాద్: సిర్పూర్ కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న కామ్రే అనిల్‌కుమార్ ఢిల్లీలో ఏఐసీసీ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్‌ను మంగళవారం కలిశారు. మహర్ నేతకాని సామాజిక వర్గానికి చెందిన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నేతకాని ఓటర్లు 50వేల మంది ఉన్నారని, తనకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత 15 ఏళ్లుగా పార్టీలో పని చేస్తున్నానని, తనకు టికెట్ కేటాయించాలని వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నెన్నెల: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మండల తహసీల్దార్ మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్ సందర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కరెంట్, ఫర్నిచర్, నీటి వసతి, మూత్రశాలలు, వృద్ధుల, దివ్యాంగుల కోసం ర్యాంపులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ గణేష్, హైస్కూల్ హెడ్‌మాస్టర్ ప్రకాష్‌రావు ఉన్నారు.

హేతుబద్ధీకరణ దిశగా అడుగులు

- ప్రభుత్వ బడుల్లో ఎఫ్ఆర్ఎస్ యాప్
- తక్కువ విద్యార్థులు ఉంటే మూసివేసే అవకాశం
- జిల్లాలో 520 ప్రాథమిక పాఠశాలలు



దేవుడ్‌పల్లిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కెరమెరి: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కొన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం కన్పిస్తుంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను ఎత్తివేసి సమీప పాఠశాలల్లో కలిపే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల హాజరు నిక్కచ్చిగా ఉండేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఫేషియల్ అటెండెన్స్ యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. వారం రోజులుగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌లోనే విద్యార్థులు హాజరు వేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో గతంలో ఉన్న బయోమెట్రిక్ యంత్రాలను సెప్టెంబర్ 1 నుంచి స్వాధీనం చేసుకోవాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో యంత్రాలను స్వాధీనం చేసుకొని కాంప్లెక్స్ స్థాయి పాఠశాలల్లో జమ చేశారు. ఈ చర్యలు ప్రభుత్వ పాఠశాలల హేతుబద్ధీకరణ వైపు ప్రభుత్వం చూస్తున్నట్లుగా ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

తక్కువ మంది విద్యార్థులుంటే చేటే..

జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలలు 720 ఉండగా, ఇందులో 520 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 42వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 2444 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా కేవలం 1996 మంది విధులు నిర్వహిస్తున్నారు. గత కొంత కాలంగా 10, 20 మంది కంటే తక్కువగా ఉన్న విద్యార్థులను సమీప పాఠశాలల్లో చేర్పించాలనే వాదనలు వినిపిస్తున్నప్పటికీ ఉపాధ్యాయ సంఘాలు ఇందుకు ససేమిరా అంటున్నాయి. కానీ ఫేషియల్ హాజరు అమలు ద్వారా పాఠశాలల్లో ఉన్న మొత్తం విద్యార్థుల సంఖ్య, నిత్యం పాఠశాలకు హాజరయ్యే వారి సంఖ్యను ప్రభుత్వం తెలుసుకోనుంది. విద్యార్థులు లేని పాఠశాలలతో పాటు 10 మంది కంటే తక్కువగా విద్యార్థులు ఉన్న పాఠశాలల జాబితాను ఇటీవల అధికారులు సేకరించారు. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను ఎత్తివేసే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో టీటీసీ, బీఎడ్ చేసి టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలను మూసి వేస్తే టీచర్ ఉద్యోగాలు చాలా వరకు తగ్గిపోతాయని వాపోతున్నారు.

ఆశ్రమాలు, గురుకులాలతో ముప్పు

గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలకు ట్రైబల్, ఎస్సీ, బీసీ సంక్షేమ పాఠశాలలతో పాటు, మైనార్టీ, జ్యోతిబాపూలే గురుకులాలతో తీవ్రస్థాయిలో ముప్పు వాటిల్లింది. గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థుల్లో చాలా మందికి ఆయా వసతిగృహాల్లో సీట్లు రావడంతో అటువైపే మొగ్గుచూపారు. కొంత డబ్బున్న వారి పిల్లలు ప్రైవేట్ బడుల్లో చదువుతున్నారు. ఫలితంగా గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. గడిచిన ఐదేళ్లతో పోల్చితే విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది కూడా 1వ తరగతిలో చేరిన విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది.

> **విద్యార్థుల సంఖ్య పెరగాలి**
>
> 
>
> ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా హేతుబద్ధీకరణ జరిగే అవకాశం ఉంది. మండలంలోని విద్యార్థులను ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలి.
>
> – ఆడే ప్రకాశ్, ఎంఎస్‌వో, కెరమెరి

బాధితులకు సత్వర సేవలు అందించాలి



108లో సౌకర్యాలు పరిశీలిస్తున్న సామ్రాట్

రెబ్బెన: 108, 102 వాహనాల సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉంటూ బాధితులకు సకాలంలో సేవలు అందించాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 108, 102 వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలతో పాటు రికార్డులు పరిశీలించారు. 108లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 108, 102 వాహనాల సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని, బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఇకపై నైట్ షిఫ్ట్‌ల్లోనూ 102 వాహనం అందుబాటులో ఉంటుందని, అత్యవసర సమయంలో గర్భిణీలు సేవలు ఉచితంగా పొందవచ్చన్నారు. 108 అందుబాటులో లేని సమయంలో 102 సేవలను గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారి సతీశ్, 108 పైలెట్ సంతోష్, ఈఎంటీ ప్రశాంత్, 102 పైలెట్ నానయ్యలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్.. ఫ్లెక్సీల తొలగింపు



కెరమెరి: రాతలు తుడిపేస్తున్న సిబ్బంది



ఆసిఫాబాద్‌అర్బన్: ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ రావడంతో జిల్లా కేంద్రంలోని రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలను మంగళవారం అధికారులు తొలగించారు. ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ నాయకుల ప్రకటనలతో కూడిన ఫ్లెక్సీలు తొలగిస్తున్నట్లు వారు తెలిపారు. ఎంపీడీవో శశికళ, గ్రామపంచాయతీ ఇన్‌చార్జి ఈవో వంశీకృష్ణ, ఎంపీవో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో రాజకీయ నాయకుల పేర్లతో ఉన్న పార్టీల రాతలను మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది తుడిపేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలకు సంబంధించిన హోర్డింగులు నేలవాలాయి. అతికించిన పోస్టర్లను చించేసి తగులబెట్టారు.

రెబ్బెన: మండలంలోని ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని తహసీల్దార్ సమీర్, ఎంపీడీవో శ్రీనివాస్‌లు అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్‌పోస్టర్లు తొలగించారు. ఎన్నికల నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోవ లక్ష్మి

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనుల వల్లనే బీఆర్ఎస్ పార్టీలో చేరికలు పెరిగాయని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని రేకులగూడ నుంచి సుమారు 50 మంది మంగళవారం సర్పంచ్ పోటు సుమలత ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి కోవ లక్ష్మి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అభివృద్ధిలో వెనుకబడిన ఆసిఫాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేసి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, నాయకులు కృష్ణ, పోతురాజుల భీమేశ్, కొంరం తిరుపతి, చింతకుంట్ల నారాయణ, జవాజీ సునీత తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన మంచు దుప్పటి





కౌటాల: మండలంలో మంగళవారం ఉదయం మంచు దుప్పటి కమ్మేసింది. గత రెండు రోజులుగా పంట పొలాలు కనిపించకుండా మంచు కురుస్తోంది. ఉదయాన్నే వాకింగ్, పొలాలకు వెళ్లే రైతులు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు.

జనగర్జనకు తరలిన బీజేపీ నాయకులు



కాగజ్‌నగర్‌టౌన్: సభకు వెళ్తున్న నాయకులు



రెబ్బెన: నినాదాలు చేస్తున్న నాయకులు

తిర్యాణి: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జనగర్జనకు దాదాపు 300మందికి పైగా కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ సార రమేశ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్, నాయకులు గెడం సుభాశ్, గాయంగి తిరుపతి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించే జనగర్జన సభకు జిల్లా కేంద్రం నుంచి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రైవేటు వాహనాల్లో భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణ కేంద్రం నుంచి మంగళవారం ఉదయం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే జనగర్జన సభకు ప్రత్యేక వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. స్థానిక పెట్రోల్‌పంప్ వద్ద గల బీజేపీ కార్యాలయం నుంచి వాహనాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబుతో పాటు తాలూకాలోని అన్ని మండలాల నుంచి బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన జనగర్జన సభకు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్, నాయకులు నాగన్న, భీమయ్య, శ్రీకాంత్, సంతోష్ తదితరులు ఉన్నారు.

రెబ్బెన: ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల మైదానంలో మంగళవారం బీజేపీ నిర్వహించిన జనగర్జన బహిరంగ సభకు మంగళవారం మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గుల్బం చక్రపాణి, ఎలమంచి సునీల్ చౌదరి, బెల్లంపల్లి ప్రభారీ అన్నపూర్ణ సుదర్శన్‌గౌడ్, మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్, జిల్లా నాయకులు రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి ఓదెలు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, టాక్సీ డ్రైవర్లను ఆదుకోవాలి

నార్నూర్: ఆటో,టాక్సీ డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫెరోజ్‌ఖాన్ అన్నారు. హెచ్‌కేజేన్ ఆటో యూనియన్ కార్యాలయంలో డ్రైవర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సర్కార్ అమలు చేస్తున్న వైఎస్ఆర్ వాహన మిత్ర స్కీం లాగానే తెలంగాణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్స్, టాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల ఆర్థికసాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పరామర్శ

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మంగళవారం పలు ఏరియాలకు వెళ్లి పలువురు బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. మందమర్రి మండలంలోని ఆదిల్‌పేట్‌కు చెందిన వేల్పుల లింగయ్య, బక్క మల్లయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణంలోని మోడో జోన్‌కు చెందిన టీ స్టాల్ సత్యం కుమారుడు మనిదీప్‌కు హైదరాబాద్‌లో ప్రమాదం జరిగి గాయాలు కాగా, వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

ఆరోగ్య మహిళా కార్యక్రమం వినియోగించుకోవాలి

జన్నారం: మహిళల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు వినియోగించుకోవాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద చేపడుతున్న పరీక్షలు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు అందిస్తున్న విధానం, సిబ్బంది పనితీరుపై వైద్యురాలు ఉమశ్రీని అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటాలు కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లెనిన్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్ర భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వం విద్యను వ్యాపారీకరణ చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో పూర్తిగా విఫలమైందన్నారు. టీఎస్‌పీఎస్సీ బోర్డు ద్వారా నిర్వహించిన ఉద్యోగాల భర్తీలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు విద్యార్థులు, నిరుద్యోగులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి దుర్గం రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి సాయి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రహీం, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి పర్వతి సాయి, మండల అధ్యక్షుడు సాయి, కార్యదర్శి బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామాల్లో సీజీజీ బృందం పర్యటన



ఐరన్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి ప్రభావిత గ్రామాల్లో మంగళవారం సెంట్రల్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ప్రతి నిధులు పర్యటించారు. సింగరేణితోపాటు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, ఉపాధి శిక్షణ కార్యక్రమాలను ప్రోగాం మేనేజర్ జానకీరాం, సీనియర్ నాలెడ్జ్ మేనేజర్ దేవీసింగ్ పరిశీలించారు. గోలేటిలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రంథాలయం, మహిళలు ఏర్పాటు చేసిన పేపర్ ప్లేట్స్ మేకింగ్ సెంటర్, టైలరింగ్ శిక్షణ కేంద్రాలను సందర్శించారు. అనంతరం చోపిడి పునరావాస కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. విద్యా వాలింటర్ సెంటర్‌లో చదువుకుంటున్న భూనిర్వాసిత పిల్లలతో కాసేపు ముచ్చటించారు. గడలపెల్లిలో సింగరేణి సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, క్రీడామైదానం, సోలార్ వాటర్‌ప్లాంట్లను సందర్శించారు. ప్రభావిత ప్రాంతాల్లో యాజమాన్యం చేపడుతున్న కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉన్నాయని కితాబిచ్చారు. గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. మూడేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. ఎస్‌వోటూజీఎం నరేందర్, కైరిగూడ పీవో సత్యనారాయణ, డీజీఎం ఫైనాన్స్ రామారావు, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్, సీనియర్ పీవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శౌర్య జాగరణ యాత్ర



కెరమెరి: సమావేశంలో పాల్గొన్న యువకులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం శౌర్య జాగరణ యాత్ర నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా జోడేఘాట్ వరకు యాత్ర సాగింది. స్థానిక హనుమాన్ మందిరం వద్ద ప్రత్యేక వాహనానికి ఆలయ పూజారి నారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ ధర్మం, సంస్కృతి పట్ల గౌరవం పెంపొందించడం, శాస్త్రీయ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో యాత్ర నిర్వహించినట్లు పేర్కొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో మంగళవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణయాత్ర నిర్వహించారు. కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాధిపై పూలు వేసి పూజలు జరిపారు. 500 మంది హిందూ నాయకులు 60 వాహనాల్లో కాగజ్‌నగర్ నుంచి జోడేఘాట్‌కు ర్యాలీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు శివగౌడ్, అరుణ్‌లోయ, బీజేపీ నాయకులు కోవ విజయ్, కొడికిపాక కమలాకర్, కోట్నాక సోమేశ్, కుమురం సంపత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించుకోవాలి

లక్సెట్టిపేట: రాబోవు ఎన్నికలను ప్రజలు సజావుగా నిర్వహించుకోవాలని సీఐ క్రిష్ణ అన్నారు. మండలంలోని చందారం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులు ఎటువంటి గొడవలు చేసుకోవద్దని, ఇరువర్గాల వారు ఇబ్బందులు లేకుండా ఎన్నికలను జరుపుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా, అల్లర్లు జరిగితే కేసులు నమోదు చేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, ఏఎస్సై రాజయ్య, హెడ్ కానిస్టేబుల్ సుభాష్, గ్రామ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'అధిక వడ్డీ చెల్లింపు'

జైపూర్: పోస్టల్‌శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై బ్యాంకుల కన్నా అత్యధికంగా వడ్డీ చెల్లిస్తున్నట్లు పోస్టల్‌శాఖ సబ్ డివిజనల్ అధికారి రామారావు తెలిపారు. స్థానిక పోస్టాఫీస్‌లో మంగళవారం పోస్టల్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకుల మాదిరిగానే పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు అన్ని రకాలుగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.